క్లుప్తంగా

వాటర్ ప్లాంట్ల పరిశీలన


వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పొదలకూరు : వైద్యారోగ్యశాఖ అధికారులు, ఉద్యోగులు పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్లను సోమవారం పరిశీలించారు. కో–లోకేటెట్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌రిషిత ఆధ్వర్యంలో పట్టణంలోని సచివాలయం బిట్–3 పరిధిలో వాటర్ ప్లాంట్లలో శ్యాంపిల్స్‌ను సేకరించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ సేకరించిన నీటిని 48 గంటల వరకు పర్యవేక్షణలో ఉంచి పరీక్షిస్తామన్నారు. ఆరోగ్య సహాయకులు కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, ఆశావర్కర్లు లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

బోధన సామగ్రితో ప్రయోజనకరం



కొడవలూరు : అభ్యసన, బోధన(లెర్నింగ్, టీచింగ్) సామగ్రితో విద్యార్థులకు ఎంతో ప్రయోజనముందని ఎంఈఓ జి.వసంత కుమారి తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా కొడవలూరు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో స్థానిక వనరులతో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌ను తయారు చేసి సోమవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యసన, బోధనా సమగ్రి వల్ల విద్యార్థులు సులువుగా నేర్చుకోగలరన్నారు. వారం రోజుల పాటు జరిగే శిక్షా సప్తాహ్‌ను ప్రతి పాఠశాలలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.లక్ష్మీభవాని, ఉపాధ్యాయిని రమణమ్మ పాల్గొన్నారు.

ఆకుముడతపై అప్రమత్తంగా ఉండాలి


వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ ఇందిరావతి

కోవూరు : వరిసాగు చేస్తున్న రైతులు ఆకుముడత తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ ఇందిరావతి అన్నారు. మండలంలోని కొత్తూరు రోడ్డులో ఉన్న పొలాల్ని ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పైరుకు ఆకుముడత సోకిందని గుర్తించారు. నివారణ చర్యలను రైతులకు సూచించారు. శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని తెలియజేశారు. ఆమె వెంట వ్యవసాయ సహాయకులు మెహరున్నీసా, చైతన్య, రాజశేఖర్ ఉన్నారు.

ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



నెల్లూరు(బారకాసు): మెడికల్ కౌన్సెలింగ్ ప్రారంభించే లోపు ప్రజావ్యతిరేకమైన 107, 108 చట్టాలను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల సమన్వయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీసీ నాయకులు నాసిన భాస్కర్‌గౌడ్, మొమ్మి కిశోర్‌యాదవ్, డాక్టర్ రాజేష్‌యాదవ్, వేణుగోపాల్, చిన్నయ్య, మధుసూర్యరావు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో మహిళలకు పూర్తి రక్షణ

నెల్లూరు(దర్గామిట్ట): పని ప్రదేశంలో మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తూ వారి గౌరవాన్ని కాపాడాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. మహిళ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలపై లైంగికంగా జరిగే దాడులను నిరోధించేందుకు ప్రతి కార్యాలయంలో కమిటీలు ఏర్పాటు చేయాలని, ఆయా కమిటీల్లో సీనియర్ మహిళా ఉద్యోగితోపాటు ఎన్‌జీఓ ఉండేట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జిల్లాస్థాయిలో కూడా కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ అంశంపై మహిళా ఉద్యోగులందరికీ సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, డీఆర్‌ఓ లవన్న, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేయాలి



సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన నియోజకవర్గ స్థాయి హామీలను నిలబెట్టుకోవాలి. అందులో ప్రధానమైన మనుబోలు మండలంలోని మెట్ట గ్రామాలకు సాగునీరు అందించే దేగపూడి–బండేపల్లి బ్రాంచ్ కెనాల్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి. గత ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించడంతో పాటు రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం కూడా చాలా వరకూ చెల్లించారు. ఈ కాలువ పూర్తయితే పొదలకూరు, సైదాపురం, మనుబోలు మండలాల్లో మెట్ట ప్రాంతాలకు సమృద్ధిగా సాగునీరు అందుతుంది.

– ఎం వెంకటేశ్వర్లు, రైతు, లింగారెడ్డిపల్లి, మనుబోలు మండలం

అట్టడిని నూతనంగా నిర్మించాలి



మండల కేంద్రమైన మనుబోలులోని మాగాణి పొలాలకు సాగునీరు సరఫరా అయ్యే అట్టడి(కండలేరు ఉప కాలువపై వంతెన) శిథిలావస్థలకు చేరుకుని ప్రమాదకరంగా ఉంది. ఈ వంతెన ఏ క్షణంలో అయినా కూలిపోయేలా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మనుబోలులోని 90 శాతం మాగాణి పొలాలకు ఈ మార్గంగుండానే సాగునీరు సరఫరా అవుతుంది. కొత్త ప్రభుత్వం అట్టడి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– కలికి వెంకటస్వామిరెడ్డి, రైతు, మనుబోలు

కోతల్లేకుండా హామీలు నెరవేర్చాలి



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఎటువంటి కోతలు లేకుండా అమలు చేయాలి. అన్నివర్గాలకు సంతృప్తి కలిగించే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలి. సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. నిలిచిపోయిన పనులను పూర్తి చేసేందుకు కృషి చేయాలి.

– తైదుపాటి వీరరాఘవయ్య, ఈపూరు, ముత్తుకూరు మండలం

అభివృద్ధి పనులు చేపట్టాలి



కొత్త ప్రభుత్వం కక్షలు, కార్పణ్యాలను ప్రోత్సహించకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టాలి. ఎన్నికల వరకే రాజకీయాలు చేసి తర్వాత అందరూ కలిసి మెలిసి అభివృద్ధి పనులు చేసుకుంటే గ్రామాలు అభివృద్ధి వైపు పయనిస్తాయి. నిరంతర రాజకీయాలు పనికి రావు.

– ఒ.ప్రభాకర్, తోడేరు, పొదలకూరు మండలం

ఎమ్మెల్యే తన వాణి వినిపించాలి



ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి కృషి చేయాలి. సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేసేందుకు అసెంబ్లీలో ఎమ్మెల్యే తన వాణిని వినిపించాలి. కక్షసాధింపు చర్యలను పక్కన పెట్టి అభివృద్ధి పనులను చేపడితే గ్రామాలు ముందుకెళ్తాయి.

– కె.ప్రసాద్‌రెడ్డి, మొగళ్లూరు, పొదలకూరు మండలం


కండలేరు ఏటి కాలువ


నీరు లేక ఎండిపోయిన బండేపల్లి కెనాల్


శిథిలావస్థలో ఉన్న అట్టడి


పూడిపోయిన మలిదేవి డ్రైయిన్


పూడిక తీయకుండా వదిలేసిన పైడేరు వాగు

సమస్యల పరిష్కారంపై కోటి ఆశలు

సమస్యలపై చర్చలు జరిగి వాటికి పరిష్కార మార్గాలు చూపేలా చట్టసభలు పనిచేయాలని వివిధ వర్గాల ప్రజలు ఆశిస్తున్నారు. రైతులకు పుష్కలంగా నీరు అందించడం, సాగునీటి కాలువల్లో పూడిక తీత పనులు, రోడ్ల మరమ్మతులు, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, కంపెనీల రాక, ఇచ్చిన హామీలన్నీ అమలు, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత ఇలా పలు అంశాలపై ప్రజలు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

• సర్వేపల్లిలో ప్రధానంగా సాగునీటి సమస్యలు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో సాగునీటి సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వంలో కాలువలు, చెరువుల మరమ్మతులు జరిగినా కొన్ని ప్రాంతాల్లో ఇంకా సమస్యలు ఉన్నాయి.

➡ వెంకటాచలం మండలంలో కనుపూరు కాలువ నుంచి చెరువులకు సాగునీరు అందుతుంది. అయితే స్లూయిజ్‌ల షట్టర్లు రిపేర్లు చేయించాల్సిన అవసరం ఉంది. సర్వేపల్లి రిజర్వాయర్ పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. కట్ట పనులను బాగుచేస్తే పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

➡ మనుబోలు మండలానికి చెందిన రైతులు దేగపూడి–బండేపల్లి కాలువ నిర్మాణానికి సంబంధించి ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో భూసేకరణ కొంతవరకు జరిగింది. కాలువ పనులను కూడా చేపట్టారు. అయితే న్యాయపరమైన సమస్యల వల్ల మధ్యలో కాలువ పనులు నిలిచిపోయాయి. రైతులు కొందరు తమ భూములను అప్పగించేందుకు విముఖత చూపారు. ఫలితంగా కాలువ నిర్మాణానికి అడ్డంకిగా మారింది.

➡ పొదలకూరు మండలంలో కండలేరు హైలెవల్ స్లూయిజ్ కింద ఉన్న ఎడమగట్టు కాలువకు లైనింగ్ పనులు గత ప్రభుత్వంలో సుమారు 20 కి.మీ దూరం మేరకు జరిగాయి. మిగిలిన పనులు జరుగుతున్న సమయంలో వర్షాలు, రైతులకు సాగునీటిని అందజేయాల్సి వచ్చి పనులు నిలిచిపోయాయి. దీంతో అర్ధాంతరంగా ఆగిన లైనింగ్ పనులను చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం గతంలో రూ.40 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఖరీఫ్‌లో సాగవుతున్న పంటలకు ఎడమగట్టు కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉంది. అయితే కండలేరులో కేవలం 6 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. సాధారణంగా దీనిని డెడ్‌స్టోరేజీగా ఇంజినీరింగ్ అధికారులు పరిగణిస్తారు.

పంట కాలువల్లో పూడికతీయాలి

కోవూరు : కోవూరు నియోజకవర్గంలో ప్రధానంగా పంట కాలువల పూడికతీత పనులు చేపట్టాల్సి ఉందని రైతులు అంటున్నారు. వీటితో పాటు రోడ్ల మరమ్మతులు, పలు ప్రధాన రహదారులను వెడల్పు చేయాల్సి ఉంది.

➡ కోవూరులో సెంట్రల్ లైటింగ్‌తో పాటు రైల్వే గేట్‌లకు అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలి.

➡ ఇనమడుగు ఆశ్రమం నుంచి జాతీయ రహదారికి వెళ్లేందుకు వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గాన్ని వెడల్పు చేయాలి. గత ప్రభుత్వంలో దీనికి సంబంధించి స్థలం కొనుగోలు కూడా జరిగింది.

➡ కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తీసుకురావాలి.

➡ పడుగుపాడు చేప పిల్లల పెంపకం కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. దీనిని బాగుచేయాలి.

➡ ఇనమడుగు నుంచి చెర్లోపాళెం వెళ్లే రహదారిని వెడల్పు చేయాల్సి ఉంది.

➡ పోతిరెడ్డిపాళెం ప్రధాన రహదారి సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త రహదారిని నిర్మించాల్సి ఉంది. గత ప్రభుత్వంలో దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది.

➡ కోవూరు నుంచి గంగవరం మీదుగా ముంబై జాతీయ రహదారికి లింక్ రోడ్డు నిర్మించాల్సి ఉంది.

➡ పడుగుపాడు నుంచి జమ్మిపాళెం వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. దీనిని మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

➡ సదరన్ చానల్, ఎల్లవ కాలువ, వేగూరు డ్రెయిన్ వంటి ప్రధాన కాలువలతో పాటు చిన్న సాగునీటి కాలువల్లో పూడిక తీయాలి. ఈ పనులు పూర్తి చేయకుంటే రైతులకు సాగునీటి సమస్యలు తప్పవు.

సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలి



కోవూరు బజార్ సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలి. వీటితో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి. పలుచోట్ల ఇరుకు రోడ్లతో ఇబ్బందులు పడుతున్నా. ఆయా రోడ్లను వెడల్పు చేయాలి.

– గుంజి శ్రీకాంత్ కోవూరు

అండర్ పాస్‌ను ఏర్పాటు చేయాలి



పడుగుపాడు నుంచి కోవూరుకు వెళ్లాలంటే ఎన్నో అవస్థలు పడుతున్నాం. ఈ మార్గంలో రైల్వే గేటు వేస్తే అరగంటపైనే వేచి ఉంటున్నాం. ఇనమడుగు సెంటర్‌లో అండర్ పాస్‌ను ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టి సారించాలి.

– తాండూరు సునీల్ కృష్ణ, పడుగుపాడు, కోవూరు

ఫ్లైఓవర్ నిర్మిస్తేనే ఊరట



కొడవలూరు రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కలగానే మారింది. దీని వల్ల మండల కేంద్రానికి వెళ్లాలన్నా, విడవలూరు, అల్లూరు మండలాలకు వెళ్లాలన్నా తీవ్ర అసౌకర్యంగా మారింది. రైల్వే మూడో ట్రాక్ ఏర్పడ్డాక మూడు లేదా నాలుగు రైళ్లు వెళ్లే వరకు గేటు తీయడం లేదు. దీంతో పెద్ద సంఖ్యలో వాహనాలు వేచి ఉండాల్సి వస్తోంది. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం జరిగితే మూడు మండలాల ప్రజలకు ఊరట లభిస్తుంది. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని బ్రిడ్జి నిర్మాణం జరిగేలా చేయాలి. టపాతోపు వద్ద అండర్ పాస్ నిర్మించినప్పటికీ పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు.

– నాగిరెడ్డి రమేష్, గౌతమ్‌నగర్, కొడవలూరు మండలం

రోడ్లు, కాలువలను బాగు చేయాలి



మండలంలో రోడ్లు, కాలువలు అత్యంత అధ్వానంగా ఉన్నాయి. యల్లాయపాళెం, కొత్తవంగల్లు, అల్లూరు రోడ్లు అత్యంత దుర్భరంగా మారాయి. లింకు రోడ్ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. నార్తురాజుపాళెం నుంచి కొడవలూరు, అల్లూరు రోడ్డు నుంచి నాయుడుపాళెం, బొడ్డువారిపాళెం వెళ్లే రోడ్లు దయనీయంగా ఉన్నాయి. దీనిపై ఎమ్మెల్యే దృష్టి సారించాలి. ప్రధాన పంట కాలువలైన ఈస్టన్ చానల్, పైడేరు లోలెవల్, హైలెవల్, తలమంచి కాలువ, మలిదేవి హై లెవల్, లో లెవల్ కాలువలు తూటాకు, గరికతో నిండి దుర్భరంగా ఉన్నాయి. అదేలా పైడేరు, మలిదేవి ప్రధాన డ్రెయిన్‌ల పూడిక తీయాలి. లేకుంటే వర్షాలు పెరిగి వరదలొస్తే గ్రామాలకు గ్రామాలే ముంపునకు గురవుతాయి.

– పెనాక నాగశ్రీనివాసులురెడ్డి, పెయ్యలపాళెం, కొడవలూరు మండలం

మలిదేవి వంతెనకు మోక్షం కలిగించాలి



మండలంలోని జాన్‌పేట, మన్మథరావుపేట, చెలికల గ్రామాలకు విడవలూరు మలిదేవి వంతెన మీదుగా వెళ్లాలి. నిత్యం వందలాది మంది ప్రజలు ఈ వంతెనపై ప్రయానిస్తుంటారు. అయితే ఇది బ్రిటీష్ కాలం నాటిది కావడంతో చిన్న వర్షానికే వంతెనపై నీరు పారడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతుంటాయి. దీంతో వర్షాకాలంలో నిత్యావసర సరుకులు దొరక్క ఇబ్బందులు పడుతున్నాం. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొత్త వంతెనను నిర్మించాలి.

– కె.విజయ్, మన్మథరావుపేట, విడవలూరు మండలం

కీలక హామీల అమలు ఎప్పుడు?



ఇచ్చిన హామీలను కొత్త ప్రభుత్వం అమలు చేయాలి. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల్లోని ఉచిత ఇసుక పంపిణీ పారదర్శకంగా జరగాలి. వీటితో పాటు బడికి వెళ్లే ప్రతి బిడ్డకు రూ.15 వేలు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం వంటి కీలక హామీలను ఎప్పుడు అమలు చేస్తారో తెలియడం లేదు. వీటిని అమలు చేయకుంటే ప్రజాగ్రహానికి గురుకాక తప్పదు.

– మన్నెం చిరంజీవులగౌడ్, తోటపల్లిగూడూరు

వైద్య సిబ్బంది చొరవ భేష్

• అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి


కొడవలూరులో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి

కొడవలూరు : లెప్రసీ(కుష్టు) కేసుల గుర్తింపులో వైద్య సిబ్బంది చొరవ భేషుగ్గా ఉందని అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి కొనియాడారు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా కుష్టుపై ఇంటింటీ సర్వే జరుగుతుండడం విధితమే. ఈ సర్వే పరిశీలన నిమిత్తం సోమవారం కొడవలూరుకు వచ్చిన ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడి సర్వేపై ఆరా తీశారు. కొడవలూరులో రెండు కేసులను గుర్తించినట్లు సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలో కుష్టును గుర్తించడం వల్ల పూర్తిగా నివారించేందుకు అవకాశం ఉందన్నారు. ఇద్దరు కుష్టు బాధితులకు నిర్దేశించిన మందులను ఇచ్చి క్రమం తప్పకుండా వినియోగించేలా చూడాలని ఆదేశించారు. ఆయా మందులను వారు క్రమం తప్పకుండా వాడేలా చూడాల్సిన బాధ్యత కూడా వైద్య సిబ్బందిదేనన్నారు. అన్ని గ్రామాల్లో విస్తృతంగా సర్వే చేయడం ద్వారా కుష్టు బాధితులను ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు. ఏ ఒక్కరూ వైకల్యం బారిన పడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. ఆయన వెంట కొడవలూరు వైద్యాధికారి జి.బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, ఏఎన్‌ఎంలు శేషుబాయి, సుభాషిణి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థినులు


ఇలాక్షి


హారిక


విఖిత

వెంకటాచలం : పల్నాడు జిల్లా వినుకొండలో వచ్చే నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు గొలగమూడిలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బి.లక్ష్మీకామేశ్వరి, పీపీ షేక్.షబిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థినులు జి.ఇలాక్షి, జి.హారిక, బి.విఖిత జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలియజేశారు.

హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.వాణి

వెంకటాచలం : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి సూచించారు. వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెల్మెట్ ధరించడంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ద్విచక్ర వాహనదారుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని తెలియజేశారు. అయితే ఎక్కువ మంది హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్నారని చెప్పారు. దీనివల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోందన్నారు. హెల్మెట్ ధరించడం నిబంధనల కోసమో లేక పోలీసుల జరిమానాల నుంచి తప్పించుకునేందుకు కాకుండా భద్రత కోసం ప్రతి ఒక్కరూ వినియోగించాలని తెలియజేశారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ వరప్రసాద్, ఏఎస్సై శ్రీధర్, న్యాయవాది శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కొడవలూరు : మండలంలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జి.వసంతకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాలు నార్తురాజుపాళెం, యల్లాయపాళెం, గౌతమ్ నగర్ సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కొత్తగా ఆధార్ చేయించుకోవాల్సిన వారు, మార్పులు చేర్పులు చేయించుకోవాల్సిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనుల్లో ఇప్పటికీ అనేక మందికి ఆధార్‌లు లేనందున వారు ప్రభుత్వ రాయితీలు కోల్పోతున్నారని చెప్పారు. వీరికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక సౌకర్యం కల్పించారని తెలిపారు. పుట్టిన తేదీ సమస్య వల్ల ఆధార్ పొందలేకపోయారని, ఇప్పుడా సమస్య లేకుండా తహసీల్దార్‌ను సంప్రదిస్తే వారు పుట్టిన తేదీతో లేఖ ఇస్తారన్నారు. ఈ విధంగా ఇచ్చేలా ఇప్పటికే తహసీల్దార్‌లను కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. ఆ లేఖతో కొత్తగా ఆధార్ పొందవచ్చని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ఆందోళన


ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కాలనీకి గతంలో పోలీస్‌స్టేషన్ పక్క నుంచి దారి ఏర్పాటు చేశారని అయితే దానిని అభివృద్ధి చేయకపోవడంతో దారికి అడ్డుగా కంప్రతుమ్మ చెట్లు పెరిగి మూసుకుపోయిందన్నారు. వీటిని తొలగించాలని కోరారు. అలాగే కరెంట్ పోతే నీటికి అవస్థలు పడాల్సి వస్తోందని, కాలనీలో హ్యాండ్ బోర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇసుకతో వంద కోట్ల స్వాహాకు సోమిరెడ్డి యత్నం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొదలకూరు : మండలంలోని సూరాయపాళెం ఇసుక రీచ్‌లో ఎమ్మెల్యే సోమిరెడ్డి రూ.వంద కోట్లను స్వాహా చేసేందుకు యత్నిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జెడ్పీటీసీ నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, మాజీ ఎంపీపీ కోనం చిన బ్రహ్మయ్య, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి సోమవారం విలేకరులతో మాట్లాడారు. సిద్ధంగా ఉన్న లక్షల టన్నుల ఇసుకను అక్రమంగా తరలించేందుకు సోమిరెడ్డి రంగం సిద్ధం చేసుకున్నట్టు ఆరోపించారు. పొదలకూరులో వైఎస్సార్‌సీపీకి చెందిన వారి మూడు లేఅవుట్లపైనే చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ముత్తుకూరు ఫ్లైయాష్ బల్కర్ల వద్ద కమీషన్ గుంజుకుంటున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. మా నాయకుడు కాకాణి ఆస్తుల విషయంలో టీడీపీ నేతల సవాల్‌ను స్వీకరిస్తున్నామని, ఆయన ఆస్తుల విలువ వివరిస్తామన్నారు. సోమిరెడ్డి కావాలనే ప్లాట్ల కొనుగోలుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో పొదలకూరు ఎంపీటీసీ గుంటి శ్రీనివాసులు, వార్డు సభ్యుడు అంజాద్, నాయకులు జి.వేణుగోపాల్‌రెడ్డి, ఖాదర్, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరంగ్ రోడ్డు.. కంపు కంపు


చెత్తకుప్పలతో నిండిన నవరంగ్ రోడ్డు

ముత్తుకూరు : ముత్తుకూరులోని నవరంగ్ రోడ్డు, శ్మశానం వీధిలో మురుగు కంపు కొడుతోంది. అడుగు పెట్టాలంటేనే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. శ్మశానంలో అంత్యక్రియలు చేసేందుకు వెళ్లే మార్గంలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. మురుగుతో నిండిపోయిన కాలువలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. విపరీతంగా దోమలు వ్యాపిస్తున్నాయి. అంటువ్యాధులు ప్రబలే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డే కాకుండా బజారు మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగుకాలువలు కూడా చెత్తతో పూడిపోయాయి. దుకాణాల వద్ద వ్యాపించే దుర్వాసనకు జనం బెంబేలెత్తిపోతున్నారు. యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపడితే తప్ప పరిస్థితి చక్కబడేలా లేదు.


మురుగునీటితో నిండిన కాలువ